భేషుగ్గా పొగాకు నారుమడులు

- గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం
- ఎకరం కౌలు రూ.90 వేలు
- నారు ధరపై వ్యాపారుల ఆశలు
- గత ఏడాది నారు వ్యాపారులకు కాసుల పంట


దేవరపల్లి- పల్లంట్ల రోడ్డులో ఆశాజనకంగా ఉన్న పొగాకు నారుమడులు


దేవరపల్లి మండలం బుచ్చియపాలెంలో షేడ్ నెట్‌లో పెంచుతున్న నారు

దేవరపల్లి: పొగాకు నారుమడులు ఆశాజనకంగా ఉన్నాయి. దాంతో నారు రేటుపై వ్యాపారులు, రైతులు గంపెడు ఆశలు పెట్టుకున్నారు. ఆగస్టు మొదటి వారంలో నారుమడులు కట్టారు. గతేడాది నారు ధర గిట్టుబాటు కావడంతో ఈ ఏడాది ఎక్కువ మంది రైతులు నారుమడులు కట్టారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు మండలం ధర్మవరం, దొమ్మేరు, తాళ్లపూడి మండలం పెనకనమెట్ట, మలకపల్లి ప్రాంతాల్లో సుమారు 2,000 ఎకరాల్లో నారుమడులు కట్టినట్టు అధికారుల అంచనా. నారు సాగు చేస్తున్న వారిలో ఎక్కువ మంది కౌలుదారులే. ఎక్కువగా దేవరపల్లి మండలం పల్లంట్ల, దేవరపల్లి, లక్ష్మీపురం, బందపురం, దుద్దుకూరు గ్రామాల్లో నారు వ్యాపారం జరుగుతుంది. ఎకరం విస్తీర్ణంలో కట్టిన నారు దాదాపు వెయ్యి ఎకరాల్లో నాటవచ్చని రైతులు తెలిపారు. వ్యాపారులే కాకుండా రైతులు సొంతంగా నారుమడులు కట్టి నారు పెంచుకుని తమ పొలాల్లో నాట్లు వేసి పొగాకు పంట సాగు చేస్తారు. వ్యాపారుల వద్ద నారు కంటే రైతుల వద్ద గల నారుకు డిమాండ్ ఎక్కువ. రైతుల వద్ద గల నారు ఆరోగ్యకరంగా ఉండి, తోటలు వేసిన తర్వాత చీడపీడలను తట్టుకుంటుందని రైతుల నమ్మకం.

కాసులు కురిపించిన నారు

గతేడాది పొగాకు నారు కట్టిన రైతులకు కాసులు కురిపించింది. డిసెంబరులో మిచాంగ్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు వేసిన తోటలు దెబ్బ తినడంతో తిరిగి నాట్లు వేయడానికి నారు కొరత ఏర్పడింది. దీంతో నారుకు ఎన్నడూ లేని ధర పలికింది. అప్పటి వరకూ ఎకరం విస్తీర్ణంలో నాటడానికి అవసరమైన 6 వేల మొక్కలు రూ.3000 నుంచి రూ.3500 పలకగా, డిసెంబరు, జనవరి నెలల్లో రూ.16 వేల నుంచి రూ.18 వేల రేటు పలికింది. ఆ సమయంలో నారు ఉన్న రైతులకు ఊహించని లాభాలు వచ్చాయి. ఎకరం విస్తీర్ణంలో నారుమడులు కట్టిన వ్యాపారులకు సుమారు రూ.20 లక్షల నుంచి 25 లక్షల ఆదాయం వచ్చింది. ఈ ధర ఫిబ్రవరి వరకూ ఉంది. గతేడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో కూడా నాట్లు వేశారు. గతేడాది నారు ధరను చూసి ఈ ఏడాది కౌలుదారులు అధిక ధరకు భూములను కౌలుకు తీసుకుని నారుమడులు కట్టారు. గతేడాది ఎకరం కౌలు రూ.40 వేల నుంచి రూ. 50 వేలు ఉండగా, ఈ ఏడాది రూ. 70 వేల నుంచి రూ.90 వేలు పలికింది. కౌలు గడువు డిసెంబరు వరకూ ఉంటుంది.

ట్రే నారుకు డిమాండ్

నారుమడిలో వేసిన నారు కంటే ట్రేలలో పెంచిన నారుకు డిమాండ్ ఎక్కువ. నారు రేటు ఎక్కువ ఉన్నప్పటికి పొగాకు సాగు చేసే రైతులు ట్రే నారుకు మొగ్గు చూపుతారు. ట్రే నారు ఆరోగ్యకరంగా ఉంటుంది. నాట్లు వేసిన తర్వాత మనేదలు (గ్యాప్) తక్కువగా ఉంటాయని రైతులు తెలిపారు. తోట ఎదుగుదల కూడా సమానంగా ఉంటుంది. పెద్ద రైతులు షేడ్ నెట్ ఏర్పాటు చేసి దానిలో ట్రేలు ఏర్పాటు చేసి నారు పెంచుతున్నారు. ఈ నారును రైతులు తమ పొలాల్లో వేసి పొగాకు పండిస్తున్నారు.

ఆరోగ్యకరంగా నారుమడులు



నారుమడులు ఆరోగ్యకరంగా ఉన్నాయి. మరొక రెండు వారాల్లో పొగాకు నాట్లు ప్రారంభం కానున్నాయి. అధిక దిగుబడులు వస్తున్న వంగడాలను రైతులు నారు పోశారు. వాతావరణం అనుకూలించడంతో నారుమడులు ఆశాజనకంగా ఉన్నాయి. డిమాండ్‌ను బట్టి ధర ఉంటుంది. నారుమడులను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పల్లంట్ల, దేవరపల్లి, యర్నగూడెం, చిన్నాయగూడెం, సంగాయగూడెం, లక్ష్మీపురం ప్రాంతాల్లో ఎక్కువగా నారుమడులు కట్టారు.

– పి. హేమస్మిత, వేలం నిర్వహణాధికారి, దేవరపల్లి

అభివృద్ధికి కలసికట్టుగా పని చేయాలి

- కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు
- తాళ్లపూడి మండల పరిషత్ సమావేశం


మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి, పాల్గొన్న ఎంపీపీ తదితరులు

తాళ్లపూడి: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు కలసి కట్టుగా పని చేయాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సూచించారు. తాళ్లపూడి మండల పరిషత్ పాలక వర్గ సమావేశాన్ని సోమవారం ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా మండల పరిషత్ నిధులతో ఆధునీకరించిన కార్యాలయ సమావేశ మందిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వివిధ శాఖల అధికాలతో సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా వ్యవసాయం, ఆర్‌డబ్ల్యూస్, ఐసీడీఎస్, విద్యుత్, గృహనిర్మాణం, పంచాయతీరాజ్, ఉపాధి హామీ పథకం, ఆరోగ్యం, విద్యాశాఖల అధికారులు తమతమ శాఖల పురోగతిని సమావేశానికి నివేదించారు. ఈ సందర్భంగా ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు ప్రజాప్రతినిధులకు గ్రామాల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా పని చేయాలన్నారు. అభివృద్ధి పనులకు కొన్ని గ్రామ పంచాయతీలు తీర్మానాలు ఇవ్వకుంటే ఎలా ముందుకు వెళ్లాలో తనకు తెలుసన్నారు. పార్టీలను పక్కన పెట్టి, అభివృద్ధికి అందరూ కలసికట్టుగా పని చేయాలన్నారు. గ్రామ పంచాయతీల్లో చెత్త సమస్యను లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.సమావేశంలో ఎంపీడీవో వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ భారతి, వైస్ ఎంపీపీ కోడాటి కనకయ్య, మండల అధికారులు షేక్ సూర్జాన్, జి మమ్మీ, సీహెచ్ బాలమణి, సీహెచ్ నెప్రాజీ , కేఎస్ వీరన్న, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మా బతుకులు బజారుపాలు చేయెద్దు

సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్‌కు రేషన్ డీలర్ల వినతి


డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణ

నల్లజర్ల: తమ బతుకులను బజారు పాలు చేయవద్దని నల్లజర్ల మండల రేషన్ డీలర్లు విజ్ఞప్తి చేశారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పునః పరిశీలించాలని కోరుతూ సోమవారం వారు నల్లజర్లలో సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. 400 రేషన్ కార్డులకు ఒక రేషన్ షాపు ఏర్పాటు చేసేందుకు వీలుగా సివిల్ సప్లయి కమిషనర్ తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డీలర్లు విజ్ఞప్తి చేశారు. ఒక్కో రేషన్ షాపునకు 700 కార్డులు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఇచ్చే కమిషన్ షాపు అద్దె, కరెంటు బిల్లు, స్టేషనరీ ఖర్చు, వేయింగ్ మెషీన్ మరమ్మతులను మినహాయించాక నెలకు రూ.8 వేలు కూడా మిగలడం కష్టంగా ఉందని మండల రేషన్ డీలర్ల సంఘ అధ్యక్షుడు సీమకుర్తి నరసింహమూర్తి వివరించారు. ఇక 400 కార్డులకు ఒక షాపు చొప్పున కేటాయిస్తే డీలర్ల ఆదాయం సగానికి తగ్గిపోతుందన్నారు. ప్రభుత్వం తీసుకున్న నూతన పాలసీ వల్ల డీలర్ల కుటుంబాలు బజారున పడతాయన్నారు. దీనిపై సివిల్ సప్లయి డీటీ సత్యనారాయణరావు మాట్లాడుతూ ఈ వినతి పత్రాన్ని ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. ఉదయం 6 గంటలకే రేషన్ పంపిణీని ప్రారంభించాలని డీలర్లకు సూచించారు. ఈ నెల బియ్యం, పంచదార మాత్రమే పంపిణీ జరుగుతుందన్నారు. డీటీ శాంతి ప్రియ కూడా పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

గోపాలపురం: రైతులు పండించిన ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా సిబ్బంది చర్యలు చేపట్టాలని ఇన్‌చార్జి తహసీల్దార్ కె.అజయ్‌బాబు అన్నారు. ధాన్యం కొనుగోలు సిబ్బంది, రైస్‌మిల్లుల యజమానులతో సోమవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి అవకతవకలూ జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సిబ్బందికి సూచించారు. దళారుల బారిన పడి రైతులు మోసపోకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ జరిగేలా చూడాలన్నారు.మండల వ్యవసాయాధికారి బి.రాజారావు, రైసుమిల్లు యజమాని వెలగా శ్రీరామమూర్తి, కొనుగోలు కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

చాగల్లు: ఖరీఫ్ ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని పలువురు రైతులు కోరారు. ఈమేరకు సోమవారం రైతు సంఘం జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో చాగల్లులో తహసీల్దార్ ఎం.మేరకమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ తేలికరకం వరి పంటలు ఇప్పటికే కోతకు వచ్చాయన్నారు. అయితే దళారులు తక్కువ రేటుకు కొనుగోలు చేస్తున్నారన్నారు. దీనిపై తహసీల్దార్ స్పందించి పది రోజుల్లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కొఠారు నాగేశ్వరరావు, కంకటాల బుద్ధుడు, కొడవడి వెంకటరాయుడు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సేవా కార్యక్రమాలు


కొవ్వూరులో దివ్యాంగులు, అనాథ బాలలకు నూతన వస్త్రాలు అందజేసిన పూర్వ విద్యార్థులు

కొవ్వూరు: పట్టణంలోని హోలీ ఏంజెల్స్ పాఠశాల పూర్వ విద్యార్థులు ఆదివారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ వలియవీడు నెల్సన్ ఆంటోనీ 50వ పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మంటపంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. దొమ్మేరు, కొవ్వూరులలోని దివ్యాంగుల ఆశ్రమాలతో పాటు మదర్ థెరిసా వీధి బాలల సంరక్షణ కేంద్రంలోని చిన్నారులకు నూతన దుస్తులు, పండ్లు, రొట్టెలు అందజేశారు. కొవ్వూరు వాత్సల్య వృద్ధాశ్రమం, ఏలూరు జానంపేట, రాజమహేంద్రవరంలోని ఆర్‌కే అనాథాశ్రమం విద్యార్థులకు ఒకరోజు అన్నదానం చేశారు. లైటిన్ ఆఫ్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో దొండపూడి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, 500 మంది రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. ప్రతి ఒక్కరికీ మామిడి మొక్కలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్ దంపతులతో పాటు మాజీ మునిసిపల్ వైస్ చైర్మన్ పరిమి హరిచరణ్ దంపతులు, నాయకులు పరిమి రామకృష్ణ, పద్మజ దంపతులు, అపుస్మా రాష్ట్ర అడిషనల్ జనరల్ సెక్రటరీ ఎంబీ ఎస్ శర్మ, రీజినల్ ప్రెసిడెంట్ జేఎస్‌సీపీ బాలాజీ, ఏలూరు జిల్లా సంఘం మాజీ అధ్యక్షుడు జి.బుల్లిబ్బాయి, కొవ్వూరు యూనిట్ అధ్యక్షుడు ఆనీష్, పూర్వ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

దేవరపల్లిలో 'స్వచ్ఛతా హి సేవ'

దేవరపల్లి: స్వచ్ఛతా హి సేవలో భాగంగా సోమవారం స్థానిక పరమేశు బయోటెక్ పరిశ్రమ ఆధ్వర్యంలో దేవరపల్లి బస్టాండ్ పరిసరాలను శుభ్రం చేశారు. తమ పరిశ్రమ ద్వారా పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించిట్టు పరిశ్రమ జీఎం శివప్రసాద్ తెలిపారు. దేవరపల్లి సర్పంచ్ కడిమి వీరకుమారి, పంచాయతీ కార్యదర్శి ఎన్.రవి కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కడిమి రాజు, పంచాయతీ సభ్యుడు పచ్చా రాంగోపాల్, పరిశ్రమ కార్మికులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళల జీవనోపాధికి మెప్మా దోహదం

- మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి
- నిడదవోలులో మెప్మా మార్కెట్ ప్రారంభం


మెప్మా మార్కెట్ స్టాల్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి

నిడదవోలు: స్వయం సహాయక సంఘాల మహిళల జీవనోపాధికి పట్టణాల్లో ఏర్పాటు చేసిన మెమ్మా మార్కెట్‌లు ఎంతగానో దోహద పడతాయని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక సంత మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన మెప్మా మార్కెట్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మెప్మా సిటీ మిషన్ మేనేజర్ ఏజ జ్యోతి మాట్లాడుతూ పట్టణంలోని స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. డ్వాక్రా మహిళలు కుటుంబ పోషణకు యూనిట్లు పెట్టుకుని నడుపుకుంటే వాటికి మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌పీలు, స్వయం సహాయక సంఘాల లీడర్లు తదితరులు పాల్గొన్నారు.

చోరీల జోరు .. ప్రజల బేజారు

- పగలు సెల్ ఫోన్ చోరీలు
- రాత్రిపూట దారికాచి దొంగతనాలు
- పోలీసుల పనితీరుపై విమర్శలు



పెరవలి: మండల కేంద్రమైన పెరవలి చోరీలకు అడ్డాగా మారింది. దీంతో ప్రజలు హడలిపోతున్నారు. పగలు సెల్‌ఫోన్ దొంగతనాలు, రాత్రిళ్లు దారి దోపిడీలు, చోరీలు జరుగుతుండడంతో గ్రామస్తులు భీతిల్లుతున్నారు. గత నెల రోజుల్లో 35 వరకూ సెల్ ఫోన్ దొంగతనాలు జరిగాయి. అయితే స్థానిక పోలీసు స్టేషన్‌కు కేవలం మూడు మాత్రమే ఫిర్యాదులు అందినట్టు సమాచారం. నిత్యం సందడిగా ఉండే పెరవలి సెంటర్‌లో రోజూ ప్రయాణికుల సెల్‌ఫోన్ చోరీలు జరుగుతుంటే పోలీసులు ఏం చేస్తున్నారనే విమర్శలు కూడా వస్తున్నాయి. ఈ సెంటర్లోని మార్కెట్ యార్డు చెక్‌పోస్టు సిబ్బంది సెల్‌ఫోన్ మూడు రోజుల క్రితం చోరీకి గురైంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.

ఆ మార్గంలో చోరీలు

మండలంలోని నల్లాకులవారిపాలెం-ముక్కామల రహదారిపై తరచూ దొంగతనాలు జరుగుతున్నాయి. అయినప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదని ముక్కామల గ్రామస్తుల ఆరోపణ. నాలుగు రోజుల క్రితం 50 మంది యువకులు దొంగలను పట్టుకునేందుకు ఈ మార్గంలో మాటువేశారు. ఎట్టకేలకు వారు ఒక్కసారిగా దొంగలపై దాడి చేసి 20 మందిని పట్టుకుని పెరవలి పోలీసులకు అప్పగించారు. అయితే వారిపై ఎలాంటి కేసులూ నమోదు చేయకుండా వదలివేశారని ఆరోపిస్తున్నారు. 10 రోజుల క్రితం ముక్కామలకు చెందిన రేలంగి వెంకటేశ్వరరావు అనే వ్యక్తి బొప్పాయికాయల వ్యాపారం పూర్తి చేసుకుని ఇంటికి వస్తుంటే దొంగలు దారి కాచి దారుణంగా కొట్టి అతడి వద్ద ఉన్న సొమ్ములు కాజేశారు. ప్రస్తుతం ఆ చిరు వ్యాపారి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని ముక్కామల గ్రామస్తులు తెలిపారు. ముక్కామల పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్న రొంప బంగారయ్య వారం రోజుల క్రితం మోటార్ సైకిల్‌పై వస్తుండగా దారికాచిన దొంగలు అతడిని తీవ్రంగా కొట్టారు. అతడి వద్ద సొమ్ము లేకపోవడంతో మోటార్ సైకిల్‌ను, అతడిని కాలువలో పడేసి వెళ్లిపోయారు. గత నెలలో పెరవలి పోలీస్ స్టేషన్‌కు వచ్చిన కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ దృష్టికి మండలంలో జరుగుతున్న దొంగతనాల విషయాన్ని స్థానిక విలేకరులు తీసుకువెళ్లారు. వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని డీఎస్పీ స్థానిక పోలీసులను ఆదేశించారు. అయితే ఎటువంటి చర్యలూ తీసుకున్న దాఖలాలు లేవు. ఇవే గాకుండా ఇండ్లలో దొంగతనాలు కూడా జరుగుతున్నాయి. దీనిపై పెరవలి ఎస్‌ఐ అప్పారావును 'సాక్షి' వివరణ కోరింది. నిత్యం రద్దీగా ఉండే పెరవలి కూడలిలోను, నిర్మానుష్యంగా ఉంటూ తరచూ చోరీలు జరిగే ప్రాంతాల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేస్తానన్నారు. అలాగే రాత్రిపూట గస్తీని పెంచుతానని చెప్పారు.

క్లుప్తంగా

స్వామివారికి లక్ష బిల్వార్చన

నిడదవోలు: మాస శివరాత్రి సందర్భంగా సోమవారం స్థానిక శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వర స్వామి వారికి లక్ష బిల్వార్చన, అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు వైభవంగా నిర్వహించారు. పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఈవో సోమాల శివ, ఆలయ ప్రధానార్చకుడు శ్రీకాకుళపు లక్ష్మీ నరసింహ శాస్త్రి పాల్గొన్నారు.

'మానవత ' సేవలు అభినందనీయం

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ సేవలు అభినందనీయమని దాత మద్దిపాటి గంగరాజు కొనియాడారు. విజయవాడ వరద బాధితులకు మానవత స్వచ్ఛంద సంస్థ మండల శాఖ లక్షలాది రూపాయిలతో ఆహారం, నిత్యావసరాలు, వస్త్రాలు అందించింది. అందుకు తన వంతు సాయంగా గంగరాజు రూ. 50 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ క్రమంలో మానవత స్వచ్ఛంద సంస్థ మండలశాఖ సోమవారం గోపాలపురంలో గంగరాజుకు అభినందన సభ నిర్వహించింది. స్థానిక శర్వాణి హైస్కూల్లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆ సంస్థ మండల అధ్యక్షుడు పప్పు సత్యకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు.ఆ సంస్థ మండలశాఖ చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు, నెల్లి చంద్రశేఖర్, కొయ్య నాగరాజు, ముప్పన కృపావరప్రసాద్, గుబ్బా లక్ష్మణరావు సభ్యులు పాల్గొన్నారు.

ఆఫీసు సూపరింటెండెంట్‌కు వీడ్కోలు సత్కారం


మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రామారావు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

తాళ్లపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న ఎం.రామారావు సోమవారం రిటైరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో వీడ్కోలు సత్కారం జరిగింది. రామారావు దంపతులను కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికతో సత్కరించారు. ఎంపీడీవో వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ అమ్మిరాజు, జూనియర్ అసిస్టెంట్ కిషోర్, ఇతర సిబ్బందితో పాటు వివిధశాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ సత్యనారాయణ మృతి


ఉనకరమిల్లిలో సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

నిడదవోలు రూరల్: మండలంలోని ఉనకరమిల్లి పంచాయతీ మాజీ సర్పంచ్ పోలిరెడ్డి సత్యనారాయణ (80) కన్ను మూశారు. సత్యనారాయణ పార్థివ దేహానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ సోమవారం పూలమాల వేసి సోమవారం నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. గ్రామాభివృద్ధికి సత్యనారాయణ ఎంతో కృషి చేశారన్నారు. జనసేన పార్టీ మండల శాఖ అధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇసుక రవాణా వివాదంలో నలుగురిపై కేసు

నిడదవోలు రూరల్: మండలంలోని పందలపర్రు ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక రవాణాలో ఇరువర్గాల మధ్య జరిగిన తగాదాలో నలుగురిపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై రమేష్ సోమవారం తెలిపారు. వీఆర్వో సత్యనారాయణకు ఇసుక లోడింగ్ బిల్లు చూపించకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసేందుకు ప్రయత్నించిన విజ్జేశ్వరం గ్రామానికి చెందిన లారీ యజమానులు దాసరి రాజ్‌కుమార్, రాంబాబు, నాని, టి.అనులపై విలేకరి ప్రకాశ్‌తో పాటు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

డైటింగ్‌తో రక్తహీనత ముప్పు

నల్లజర్ల: డైటింగ్ పేరుతో కౌమార దశ బాలికలు పరిమిత ఆహారం తీసుకుంటూ రక్తహీనత, అనారోగ్యం బారిన పడుతున్నారని ఆమెన్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు ఇవాంజలిన్ అన్నారు. దూబచర్ల ఉపాధ్యాయశిక్షణ సంస్థ (డైట్)లోని విద్యార్థినులకు సోమవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బందితో కలసి పోషకాహార లోపం-రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఆమెన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఐరన్ ప్లస్ కార్యక్రమాన్ని జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్‌గా నల్లజర్ల మండలంలో ప్రారంభించామన్నారు.

ఆర్డీవోగా రాణి సుస్మిత బాధ్యతల స్వీకరణ



కొవ్వూరు: రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో)గా రాణి సుస్మిత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ కొద్ది రోజుల క్రితమే పార్వతీపురం సబ్ కలెక్టర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇప్పటి వరకూ ఆర్.కృష్ణనాయక్ ఇన్‌చార్జ్ ఆర్డీవోగా కొనసాగుతున్నారు. కళ్యాణదుర్గం నుంచి సుస్మిత బదిలీపై కొవ్వూరు వచ్చారు. 2022 గ్రూప్-1లో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించిన సుస్మిత విశాఖపట్నంలో శిక్షణ అనంతరం మొదటి పోస్టింగ్‌గా కళ్యాణదుర్గంలో పని చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె ఇక్కడ నియమితులయ్యారు. కాకినాడ జిల్లా పిఠాపురం ఈమె స్వస్థలం. హైదరాబాద్, బెంగళూర్‌లలో గతంలో ఆమె ప్రైవేట్ స్కూళ్లకు ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం అడ్మినిస్ట్రేటివ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ గ్రూప్-1కు ఎంపికయ్యారు. ఆర్డీవో కార్యాలయ సిబ్బందితో పాటు డివిజన్ పరిధిలోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు సోమవారం ఆమెను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏజీఆర్‌బీ ఏఈగా మణికంఠరాజు



కొవ్వూరు: అఖండ గోదావరి రివర్ బ్యాంక్ అసిస్టెంట్ ఇంజినీర్‌గా జి. మణికంఠరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ పని చేసిన ఏఈ సునీల్‌బాబు ధవళేశ్వరం ఆర్‌సీవో (రివర్ కన్జర్వేటివ్ ఆపరేషన్స్) సెక్షన్ ఏఈగా బదిలీ అయ్యారు. గత గోదావరి పుష్కరాల సమయంలో మణికంఠరాజు ఇక్కడ ఏఈగా పని చేశారు.

4న నిడదవోలులో జాబ్‌మేళా

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అక్టోబర్ 4 వతేదీ ఉదయం 9 గంటల నుంచి నిరుద్యోగ యువతకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి గంటా సుధాకర్, జిల్లా ఉపాధి కల్పనాధికారి హరిశ్చంద్రప్రసాద్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జ్యోతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళాకు ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరవుతారు. ఎస్ఎస్‌సీ, డిప్లొమా, డీ ఫార్మసీ, ఇంటర్, డిగ్రీ, బీ ఫార్మసీ, పోస్ట్‌గ్రాడ్యుయేషన్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంఫార్మసీ విద్యార్హతలున్న 19 నుంచి 30 ఏళ్ల యువతకు మాత్రమే ఇక్కడ ఉద్యోగావకాశాలు ఉంటాయన్నారు.